# జీవన వేదం

యార్లగడ్డ అచ్యుతరామయ్య



'హాయిగా ఆత్మహత్య చేసుకోవడం ఎలా?' అన్న అర్థం వచ్చే టైటిల్ వున్న ఇంగ్లీషు పుస్తకాన్ని అరవింద్ అప్పటికే అయిదుసార్లు చదివాడు. అందులోని ఒక పద్ధతి ఎంతో సులువుగానూ, హాయిగానూ వుందనిపించింది. దానికి కావలసిన సరంజామా అల్లా- తలకాయ పట్టేంత ప్లాస్టిక్ సంచీ, చిన్న తాడూ, ఓ క్వార్టర్ బాటిల్ విస్కీ- అంతే! అప్పటికే ఆ మూడు వస్తువులూ సిద్ధం చేసుకున్నాడు.

కొద్ది క్షణాల్లో చనిపోబోతున్నానని తలచుకోగానే- ఒక్కసారిగా ఎవరో కడుపులో చేయిపెట్టి దేవినట్లుగా అనిపించింది. వెంటనే తల్లి గుర్తుకువచ్చింది. 'అమ్మా, నన్ను క్షమించమ్మా! నీ విచ్చిన జన్మను కొనసాగించలేని అసమర్థుణ్ణి' అతని కళ్ళు ముసురు పట్టినట్లు కుండపోతగా వర్షిస్తూనే వున్నాయి.

కిటికీలో నుండి ఒకసారి ఆకాశంవైపు చూశాడు. చంద్రుడు అనీమియా పేషెంటులా తెల్లగా పాలిపోయాడు. చుట్టూ వున్న మబ్బుతునకలు - విరిగిపోయిన పాలలా వున్నాయి.

తను పనిచేస్తున్న కంపెనీ లాకౌట్ చేసి సంవత్సరం దాటిపోతోంది. తిరిగి అది తెరుస్తారన్న నమ్మకం కూడా లేదు. ఏదో ఒక ఉద్యోగం సంపాదించాలని ఎంతగా ప్రయత్నించినా నిరాశే ఎదురవుతోంది. తెలుసున్న వాళ్ళ దగ్గరల్లా అప్పులు చేసి, ఒక పూట తినీ, మరోపూట తినకుండా ఎలానో ఇంతవరకూ నెట్టుకు వచ్చాడు. ఈ మధ్య జీవించాలన్న ఉత్సాహం పూర్తిగా చచ్చిపోయింది. అందుకే గతవారం రోజులుగా సులువుగా చనిపోయే మార్గాలను అన్వేషిస్తున్నాడు.

ఇన్ని బాధలతో తను తలమునకలై వుంటే- తల్లిని చూడాలని వుందని చెప్పి భార్య మానస కొడుకుని తీసుకొని ఈ ఉదయాన్నే పుట్టింటికి బయల్దేరింది. తనిక్కడ ఎలా చచ్చినా ఆమెకు పట్టదన్నమాట! బాగా సంపాదిస్తున్నప్పుడే భర్త కానీ, లేకపోతే పూచికపుల్లతో సమానమన్నమాట!! భార్యాభర్తల మధ్య సంబంధాలలో ఈ వ్యాపార లక్షణాలు ఎలా ప్రవేశించాయి? ఇంతటి కష్టకాలంలో తనని ఒంటరివాణ్ణిగా చేసిపోయిన భార్య కోసం తనెందుకు కష్టపడాలి? అసలెవరికోసమని బ్రతకాలి?

తన ప్రాణస్నేహితుడు రవీంద్ర గుర్తుకు వచ్చాడు. బంధుత్వం కన్నా స్నేహమే గొప్పదనిపించింది. చిన్ననాటి నుండి నేటి వరకూ వారిద్దరి మధ్యా స్నేహ మాధుర్యం ఏమీ తగ్గలేదు. చనిపోయే ముందు రవీంద్రకు లెటరు రావాలనిపించింది. అది చదువుకుని రవీంద్ర 'నీకిన్ని కష్టాలెదురైతే నాకెందుకు చెప్పలేదురా! నాకు చేతనైన సహాయం చేసేవాణ్ణి కదా!' అనుకుంటాడేమో! కానీ... తన కష్టాలు స్నేహితుడు తీర్చగలిగేవి కావు, తన చావుతోనే అవి పరిష్కారవుతాయి.

రవీంద్రను వెంటనే చూడాలనిపించింది. ఇదే ఊరిలో ఉండి వుంటే వెంటనే కలవచ్చు. ఎక్కడో సూర్యాపేటలో వుంటున్నాడు. ఎంత లేదన్నా మూడు గంటల ప్రయాణం. తనకిప్పుడు అంత సమయం లేదు.

చావడానికి తనకెందుకింత తొందర? బ్రతుకుపై ఎందుకింత రోత? ఈ బ్రతుక్కి గమ్యం కానీ, అర్థం కానీ వున్నాయా? జీవితమంటేనే సమస్యల తోరణమా? ఒక సమస్య నుంచి మరో సమస్యకు పయనించడమే జీవితమైతే ఎందుకసలు జీవించడం! ఈ బేతాళ ప్రశ్నలకు సమాధానాలు తెలిసిన విక్రమార్కుడెక్కడ?

ఇన్ని ఆలోచనలతో వేడెక్కిన ఈ మెదడు- కొద్ది నిమిషాలలో మంచు ముద్దగా మారిపోబోతోంది కదా అన్న సంగతి గుర్తుకువచ్చి- ఓ నిర్లిప్తమైన నవ్వు అతని పెదవులపై పాకింది.

టక్... టక్... టక్... మన్న శబ్దం ఏదో అపశృతిలా వినిపించింది. విసుగ్గా వెళ్ళి వీధి వైపునున్న తలుపు తెరిచాడు. ఎదురుగా రవీంద్ర కనిపించేసరికి ఆశ్చర్యమూ, ఆనందమూ ఒక్కసారే కలిగాయి. కొంపతీసి- తనేం భ్రమకు గురికాలేదు కదా అని ఒంటిపై గిచ్చుకున్నాడు. తను ఆఖరి క్షణాలను లెక్కపెడుతున్నట్లు రవీంద్రకు ఎలా తెలిసింది? టెలీపతీ లాంటిదేమీ లేదు కదా!

రవీంద్ర వేగంగా వచ్చి అరవింద్‌ను కౌగలించుకున్నాడు. ఎంతో కాలం తర్వాత కలుసుకోవడం వల్ల అభిమానమంతా గుండె లోతుల్లో నుండి తన్నుకొచ్చింది.

ఎప్పుడూ లేనిది- అరవింద్ ఇంట్లో విస్కీ బాటిల్, దాని ప్రక్కనే ఆత్మహత్యలకు సంబంధించిన పుస్తకమూ చూసి రవీంద్ర మొహంలో రంగు మారింది.

''అరవింద్, ఏమిట్రా ఇదంతా?'' అని వాటివైపు చూపించాడు.

వెంటనే ఏం సమాధానం చెప్పాలో అరవింద్‌కు తోచలేదు... ''రవీ! వున్న ఉద్యోగం పోయింది. ఎంత ప్రయత్నించినా మరో ఉద్యోగం దొరకడం లేదు. దొరికినచోటల్లా అప్పులు చేసేశాను. ఫీజులు కట్టలేదని



ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 3-5-96

శీనుని స్కూలు నుండి వెళ్ళగొట్టారు. రెండు నెల్ల నుండి డబ్బు కట్టలేదని పాలవాడు మానసని నానా మాటలు అని పోయాడట. కట్టుకున్నదాన్నీ, కన్నబిడ్డనూ సుఖపెట్టలేని బ్రతుకునాది. ఈ కష్టాలన్నీ అనుభవించడానికే నేను బ్రతకాలా? దానికంటే, ఈ జీవితానికి ఇంతటితో ఫుల్‌స్టాప్ పెట్టేయడం మంచిదనే నిర్ణయానికి వచ్చాను. అందుకే... ఇలా...'' ఆ తర్వాత మాటలు రాక అరవింద్ చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు.

రవీంద్ర సోఫాలో కూర్చుని అరవింద్‌ని తన ఒడిలో పడుకోబెట్టుకుని తలపై ఆప్యాయంగా నిమిరాడు. చిన్నప్పుడు అమ్మ ఒడిలో దొరికిన ప్రశాంతతా, భద్రతా తిరిగి దొరికినట్లనిపించిందతనికి.

''అరవింద్! ఇంట్లో ఎలుకలున్నాయని ఇంటినే తగలబెట్టుకున్నట్లు, జీవితంలో సమస్యలెదురైతే ఆ జీవితాన్నే తుదముట్టించుకుంటారా? నీవిలా ఆత్మహత్య చేసుకుంటే నీ భార్యాబిడ్డల గతేం కావాలి? జీవితంలో సమస్యలెదురైతే వీరోచితంగా వాటిని ఎదుర్కోవాలి కానీ, మధ్యలో ఇలా చేతులెత్తేస్తారా? ఉద్యోగం పోడవమన్నది నీ వ్యక్తిగత లోపం వల్ల కాదు కదా! మీ కంపెనీని లాకౌట్ చేయడమన్నది ఓ సామాజికసమస్య. దానికి పరిష్కారం సమాజంలోనే వెదకాలి... అది సరే కానీ- బయట వాతావరణమెంతో బావుంది, పద...'' అంటూ బయటికి దారితీసాడు రవీంద్ర.

ఇద్దరూ నడుస్తూ అలా చాలాదూరం వెళ్ళారు. చల్లగాలికి అరవింద్ మనసు సేదతీరింది. మంచివాడి హృదయంలోని ప్రేమలా- చంద్రుడి నుండి వెన్నెల లోకమంతా వ్యాపిస్తోంది.

ఎక్కడి నుండో ఓ జానపద గీతాన్ని చల్లగాలి మోసుకొచ్చింది. ఆ పాట వినిపిస్తున్న వైపుగా వాళ్లిద్దరూ నడక ప్రారంభించారు. కొంతదూరం వెళ్ళగానే- రోడ్డు ప్రక్కన వున్న గుడిసెల్లోని పురుషులంతా నృత్యం చేస్తూ, కోలాటమాడుతూ వుంటే, చుట్టూ స్త్రీలు కూర్చుని ఆ నృత్యానికి అనుగుణంగా పాడుతున్నారు.

ఆ దృశ్యం చూడగానే అరవింద్‌లో గొప్ప ఉత్సాహం పెల్లుబికింది. జీవితంపై ఆశ మొలకెత్తింది. ''ఏరా రవీ, వీళ్ళింత ఆనందంగా ఎలా వుండగలుగుతున్నారంటావూ?'' అన్నాడు.

''కారణం ఒక్కటే- సమిష్టి జీవనం. వాళ్ళు దుఃఖాన్నయినా సమిష్టిగానే పంచుకుంటారు. అప్పుడది వాళ్ళనంతగా బాధించదు. వాళ్ళకున్నన్ని సమస్యలు కానీ, వాళ్ళ జీవితంలో వున్నంత అభద్రత కానీ నీకున్నాయా? రేపు కూలీ దొరుకుతుందా, లేదా అని హైరానా పడుతూ ప్రస్తుత సమయాన్ని వాళ్ళు దుర్భరం చేసుకోరు. రేపటి గురించి రేపే ఆలోచిస్తారు. భద్రత పేరుతో మనం జీవితాన్ని చాలా క్లిష్టం చేసేసుకున్నాం''

స్నేహితుడు చెబుతున్న విషయాలను అరవింద్ శ్రద్ధగా వింటున్నాడు.

''మనిషి సహజంగానే సంఘజీవి. కానీ... ఆధునిక జీవితం పేరుతో- సంపాదనే ధ్యేయంగా మనిషి తన చుట్టూ తాను గోడలు కట్టుకుంటున్నాడు. సాయంకాలం అయ్యేసరికి ఎవరి కలుగులో వారు దూరిపోతారు. అందరూ కలసి మెలసి జీవించడం అనే దానికి దూరమైపోయి ఒంటరితనానికి దగ్గరయ్యాం. అందుకే ఎవడి సమస్య వాడికి భూతంలా కనిపించి జీవితమంటేనే విరక్తి కలుగుతోంది. ఆ కలుగుల్లో నుండి బయటపడితే, బయట ప్రపంచం ఎంత వుందో, అందులో తన పాత్ర ఏమిటో అర్థమవుతుంది'' అన్నాడు రవీంద్ర.

అరవింద్ ఆలోచిస్తున్న కొద్దీ రవీంద్ర చెప్పింది నిజమే అనిపిస్తోంది. ఇంతవరకూ - తన ఉద్యోగం, తన సంసారం తప్ప తోటి మనుషులు ఎలా జీవిస్తున్నారన్న సంగతి ఆలోచించలేదు. ఎవడికి వాడుగా వుంటే అది సమాజమెలా అవుతుంది? వ్యక్తుల గుంపు మాత్రమే కానీ!


సమాజంలో ఒకడిగా తన్ను తాను దర్శించుకున్నప్పుడు- అరవింద్‌లోకి ఏదో కొత్త శక్తి ప్రవేశించినట్లయింది. తన జీవితంపై ఉత్సాహం కలిగింది.

''రవీ... నా జీవన విధానంలోని లోపం గ్రహించాను. దాన్ని సరిదిద్దుకోడానికి ఈ రోజే ప్రారంభిస్తాను. కానీ, ఈ కష్ట సమయంలో మానస నన్ను వదిలిపెట్టి పుట్టింటికి పోవడాన్ని మాత్రం క్షమించలేను'' అన్నాడు అరవింద్ నిష్ఠూరంగా.

''మానస పుట్టింటికి వెళ్ళలేదు. నీ ప్రవర్తన వారం రోజుల నుండీ వింతగా కనిపించి, ఈ ఉదయం పరాకాష్ఠకు చేరడం గమనించి- పుట్టింటికని నీతో అబద్ధం చెప్పి మా ఊరు వచ్చింది. తను అలా రాకపోతే నిన్ను నేను రక్షించుకోగలిగేవాణ్ణా?!'' అన్నాడు రవీంద్ర.

అరవింద్‌కు వెంటనే భార్యాబిడ్డలను చూడాలనిపించి రవీంద్రతో కలసి సూర్యాపేట బయల్దేరాడు.

## చక్రాలపై మసీదు



కొండ మహమ్మద్ వద్దకు రాకపోతే, మహమ్మద్ కొండ వద్దకు వెళ్ళారు అనేది నిన్నటి లోకోక్తి. కాని కులాలాంపూర్‌లో మసీదు వద్దకు వెళ్ళి ప్రార్థన చేయలేనివారి కోసం మసీదు తీసుకొని వెళ్ళే పద్ధతి అక్కడి మునిసిపాలిటీ కొద్దికాలం కనిపెట్టింది.

మలేషియాలో ముసల్మానులు ఎక్కువ. అక్కడి మునిసిపల్ అధికారులు 'సురావ్'ను నిర్మించారు. మహమ్మదీయుల ప్రార్థన చేసే హాల్‌ను సురావ్ అంటారు. ఓడలపై ఎగుమతి చేయడం కోసం నిర్మించే 'షిప్పింగ్ కంటైనర్'వలే కనిపించే ఈ హాలును నమాజ్ చేసుకోడానికి మునిసిపాలిటీ అద్దెకు ఇస్తుంది. కుటుంబ సభ్యులు లేక కొందరు మిత్రులు కలిసి నమాజ్ చేయడానికి ప్రత్యేకముగా దీనిని అద్దెకు పుచ్చుకుంటున్నారు. మునిసిపాలిటీకి అద్దె చెల్లిస్తే, ఆ మొబైల్ మసీదును ట్రక్కు ట్రైలర్‌గా అమర్చి అక్కడికి చేరుస్తారు. ఎయిర్‌కండిషన్ చేయబడిన ఈ చిన్న మసీదులో 15, 20 మంది సులభంగా నమాజ్ చేసుకోవచ్చును. పతలింగ్‌జయ మునిసిపల్‌కౌన్సిల్‌అధ్యక్షుడు మహమ్మద్ నార్‌బదర్ దీని నిర్మాణమునకు స్ఫూర్తి ఇచ్చాడు.

మొబైల్ దేవాలయాలు నిర్మించాలని ఆలోచన మన మునిసిపాలిటీలకు రాకపోవడం విచారకరము. మునిసిపల్ ఆదాయం పెంచుకోడానికి ఇది ఒక మార్గం!

**- ముకరమ్**